క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న జేఎల్‌ఎం కర్ణ

సీతానగరం: మండల కేంద్రంలో నిరంతరం విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్న హడ్కో కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మరు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న కారణంగా విద్యుత్ వినియోగదారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరడం వల్ల ఏఈ విశ్వేశ్వరరావు స్పందించి సిబ్బంది సహకారంతో మరమ్మతులు చేశారు. దీంతో గృహావసరాలకు విద్యుత్ పునరుద్ధరించినట్లు స్థానికులు తెలియజేశారు. అలాగే విద్యుత్ వైర్లపై వేలాడుతున్న కొమ్మలను తుంచి తొలిగించారన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సింహాచలం

బలిజిపేట: రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై సింహాచలం కోరారు. ఈమేరకు రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వినియోగంపై వంతరాం రహదారిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు మద్యం తాగరాదని, సెల్‌ఫోన్లు వినియోగించరాదని, పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించరాదని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అదేవిధంగా యువత మత్తుకు బానిసకాకూడదని స్పష్టం చేశారు. యువతను సరైన మార్గంలో తల్లిదండ్రులు నడిపించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: స్థానిక పీఎస్‌బొడ్డవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగులుసీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీఎస్ఎస్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మిగులుసీట్లు తక్షణ భర్తీ చేయనున్నామన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పాఠశాలకు హాజరు కావాలని సూచించారు.

తోణాం అప్పడాలు వడియాలు రుచిలో ప్రత్యేకం



గ్రామంలో ఎండలో ఆరబెట్టిన తయారు చేసిన అప్పడాలు

సాలూరు రూరల్: మండలంలోని తోణాం గ్రామంలో ప్రతి శనివారం సంత నిర్వహిస్తారు. ఈ సంతలో ఏజెన్సీ గిరిజనులు వారి అటవీ ఉత్పత్తులు అమ్ముకోవడంతో పాటు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుంటారు. అయితే తోణాం గ్రామంలో వ్యాపారులు సొంతంగా తయరు చేసిన అప్పడాలు, వడియాలు ఇక్కడ ప్రత్యేక రుచిని కలిగి ఉంటాయి. దీంతో ఇక్కడ అప్పడాలు వడియాలు కొనుగోలు చేయడానికి ఏజెన్సీ గ్రామ ప్రజలతో పాటు సాలూరు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, సాలూరు పట్టణ వాసులు ఇష్టపడుతుంటారు. ఈ క్రమంలో ఇక్కడి అప్పడాలు, వడియాలకు ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది.

పవిత్ర కర్మలను ఆచరించాలి




భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

పాలకొండ: ప్రతి ఒక్కరూ పవిత్రకర్మలను ఆచరించడం ద్వారా దైవానుగ్రహం పొందగలరని సత్యసాయి సేవా సమితి ప్రతినిధి ఎస్‌వీ రమణ అన్నారు. పట్టణంలోని నాగవంశపువీధిలో గల రామమందిరంలో దివ్యజ్ఞాన భోధన సత్సంగం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ జీవితం అశాశ్వతమన్న విషయం అందరూ తెలుసుకుని.. ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం భగవద్గీత పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్తలు కంచుమోజు రామ్మోహనరావు, డి.యోగేశ్వరరావు, తుమ్మగుంట శంకరరావు, జల్లు నారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ఆందోళనలో అన్నదాత

- రైతులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- 8వేల మందికి అందని అన్నదాత సుఖీభవ





బలిజిపేట:

కూటమి ప్రభుత్వం అమలు చేసిన అన్నదాత సుఖీభవ పథకం బలిజిపేట మండలానికి చెందిన 8వేల మంది రైతులకు అందకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది సుఖీభవ పథ కం కాదని దుఃఖీభవ పథకమని చలోక్తులు విసురుతున్నారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ తమ ఖాతా ల్లో నగదు జమ కాలేదంటూ గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా పేరును అన్నదాత సుఖీ భవగా మార్చింది. ఈ పథకం గత సంవత్సరం రైతులకు ఇవ్వకుండా నట్టేట ముంచిందని ఆవేదన చెందుతున్నారు. అంతేకాక గత ప్రభుత్వం అందించిన దానిలో సగం మందికైనా ఇవ్వకుండా చేతులు దులుపుకుందని విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పథకం మండలం 16,754మంది రైతులకు అందితే కూటమి ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ పథకం 7,926 మందికి మాత్రమే వర్తించిందని ఈ ప్రకారం ఎంతమంది రైతులు నష్టపోయారో తెలుస్తోందని చెబుతున్నారు. పథకం అమలైనా రైతుల ఖాతాల్లో నగదు జమ కాకపోవ డం గమనార్హం.

వీరంతా అనర్హులు..

- 10 సెంట్ల భూమికి తక్కువగా ఉన్నవారు పథకానికి అనర్హులు.
- భూమి ఉన్నా వెబ్‌ల్యాండ్‌లో పేరులేనివారు అనర్హులు.
- రైతు చనిపోతే నామినీకి వర్తింపులేదు. ఇలా లేనిపోని కొర్రీలు పెట్టి సగం మందికి కూడా పథకాన్ని వర్తింపుచేయకుండా కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో..

గత ప్రభుత్వంలో రైతు ప్రతి ఒక్కరికీ ఎటువంటి ఆంక్షలు లేకుండా పథకం వర్తింపు జరిగిందని చెబుతున్నారు. ఎంత భూమి ఉందనే ప్రశ్నే లేకుండా, ఆన్‌లైన్‌లో ఉన్నాడా? లేదా? అనేది చూడకుండా, పోడు భూములా అనేది పట్టించుకోకుండా ఆంక్షలకు తావులేకుండా ప్రతి రైతుకు రైతు భరోసా గత ప్రభుత్వం అందించిందన్నారు. చెప్పింది చెప్పినట్లు చేసిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని రైతులు స్పష్టం చేస్తున్నారు.

బీమా వసూలు ఘనత కూటమిదే

రైతుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ప్రతి రైతు పేరుతో పంటల బీమా పథకం చేయించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిది అయితే పంటల బీమా నగదు రైతులే చెల్లించాలని కూటమి ప్రభుత్వం ఆదేశించిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గతేడాది పంటల బీమా పథకం ద్వారా లబ్ధి చేకూరలేదన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో రైతులకు నిరాశే మిగులుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడికి తిరగాలి

అన్ని అర్హతలు ఉన్నప్పటికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తింపు కాకపోవడంతో ఎక్కడికి తిరగాలో రైతులకు ప్రశ్నార్థకంగా ఉంది. ఇస్తామన్నది రైతులకు అందేవిధంగా చేయాలి తప్ప లేనిపోని నిబంధనలు పెట్టడం, వారిని ఇబ్బందుల పాలు చేయడం సమంజసంగా లేదు.

–గౌరునాయుడు, రైతు, నారాయణపురం, బలిజిపేట మండలం

ఘనంగా జానపద భజన గీతాలు



భజన కీర్తనలు ఆలపిస్తున్న కళాకారుడు బంకురు శంకరరావు, కన్నంనాయుడు

సీతానగరం: హిందూ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడేవిధంగా జానపద రూపాల ద్వారా ప్రజలను చైతన్యపర్చడానికి తమవంతు కృషి చేస్తున్నామని జానపద కళాకారుడు ఎస్.అన్నంనాయుడు, భజనమండలి సభ్యుడు బి.శంకర రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని కృష్ణారాయపురంలో పి.బలరాంనాయుడు, వెంకటరమణల నివాసంలో భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం బూర్జ కృష్ణ మందిరం అర్చకుడు రొంగలి శ్రీనివాసరావు, విశ్రాంత గ్రేడ్–1తెలుగుపండిట్ జి.అప్పలస్వామిల పర్యవేక్షణలో సాంస్కృతిక జానపద కళాకారుల భజనకార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కునారిల్లుతున్న జానపద కళలకు జీవం పోయాల్సిన అవసరం ఉందని, హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా జానపద కళలు భజనలు, జముకులు, తంబుర, డప్పువాయిద్యాలు, చిడతలు, తప్పిటగుళ్ల, కోలాటాలు తదితర సాధనాలతో శిక్షణ పొంది ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీయమన్నారు. జానపద కళారూపాలపై అవగాహన కల్పించుకున్న వారంతా శుభకార్యాలు, పండగలు, వివాహాలు తదితర కార్యక్రమాల్లో జానపద కళలను గౌరవించాలని కోరారు. అనంతరం పి.అప్పమ్మ జ్ఞాపకార్థం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎం.కృష్ణవేణి, ఎం.అప్పలనాయుడు, పలు గ్రామాల కళాకారులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి



కార్యక్రమానికి హాజరైన యువతీయువకులు

పార్వతీపురం రూరల్: యువతీ యువకులు తమ బంగారు భవిష్యత్‌పై దృష్టిసారించి ప్రాథమిక దశ నుంచే చదువుపట్ల ఆసక్తి, దేవుడి పట్ల భయభక్తులు కలిగి ఉండాలి. ప్రధానంగా చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని బెలగాం పునీత కార్మిక జోజప్పగారి దేవాలయం విచారణ కర్త ఫా. కొమ్మారెడ్డి తోమస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 12న అంతర్జాతీయ యువత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఘనంగా దేవాలయంలో వేడుకలను నిర్వహించారు. యువజన విభాగం డైరెక్టర్ ఫా.గుప్త, ఫా.కె.డేవిడ్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక దివ్యబలి పూజను సమర్పించారు. అనంతరం భక్తి గీతాలకు చిన్నారుల నృత్యాలు, బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

అమ్మసేవా సమితి చతుర్థ వార్షికోత్సవం



కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను సన్మానిస్తున్న జిల్లెళ్లమూడి అమ్మ సేవా సమితి సభ్యులు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని ఏపీఎన్‌జీఓ హోంలో ఆదివారం జిల్లెళ్లమూడి అమ్మ సేవా సమితి చతుర్థి వార్షికోత్సవాన్ని సేవాసమితి సభ్యులు అట్టహాసంగా నిర్వహించారు. పార్వతీపురం అధ్యక్షుడు గంటేడ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త వి.ధర్మసూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రతిరోజూ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మరో ముఖ్య అతిథి ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జరుగుతున్న ఒక మంచి సేవా కార్యక్రమం ఈ అన్నదానమని కలకాలం ఈ కార్యక్రమం కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు విశాఖపట్నం, విజయనగరం, ఎస్‌కోట, పాలకొండ, రాజాం, శ్రీకాకుళం మొదలైన ప్రాంతాల నుంచ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరినాట్లు



నాట్లు వేసిన మడులలో నిలిచి పోయిన నీరు

సీతానగరం: ఇది చెరువు కాదు. నీటమునిగిన వరినాట్లు దుస్థితి ఇది. మండలంలో శనివారం రాత్రి వర్షం కురవడం, సీతానగరం ప్రాజెక్ట్ నీరు రావడం వల్ల చినభోగిలి పొలాల్లో ఇటీవల వరినాట్లు వేసిన మళ్లలో నీరు చేరింది. వృథానీరు వెళ్లాల్సిన దారులు ఆక్రమణకు గురవడంతో నాట్లు ఇలా మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బి.అప్పారావు, సత్యవతిల పొలంలో అధికంగా నీరు చేరినప్పుడు ఆ నీటిని మళ్లించడానికి కల్వర్టు, కాలువ ఉండేదని రైతులు తెలియజేశారు. ఇపుడా పొలం దిగువనున్న వారు కల్వర్టును, కాలువను ఆక్రమించడంతో వరినాట్లు వేసిన మడులలో నీరు నిల్వ ఉండి పోవడం, వరిమొనలు నీటతేలడంతో మళ్లీ వరినాట్లు వేసుకోవాల్సి వస్తుందని అంటున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి వృథానీరు మళ్లించడానికి, కల్వర్టుకు ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు మరమ్మతులు చేపట్టి సత్వరచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదివాసీ ఆచార, సంప్రదాయాల పరిరక్షణకు కృషి

- ఆర్ట్స్ డైరెక్టర్ సన్యాసిరావు



మాట్లాడుతున్న ఆర్ట్స్ డైరెక్టర్ సన్యాసిరావు

సీతంపేట: ఆదివాసీ ఆచార, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు పిలుపునిచ్చారు. మండలంలోని ఓంద్రుజోలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2002 నుంచి గిరిజన గ్రామాల్లో ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివాసీ మేళా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గిరిజనుల జీవన విధానాలపై ఇంతవరకు ఆదివాసీ కాలచక్రం, సవర, జాతాపు సరాగాలు వంటి పుస్తకాలు ప్రచురించినట్లు తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు ఏర్పాటు చేసి వారు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించామన్నారు. ఆదివాసీల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో మన్యం సహజ ఉత్పత్తిదారుల సీఈఓ బి.శంకరరావు, కోఆర్డినేటర్ సందీప్, ఆదివాసీ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ప్రతినిధి గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

కరుణించని వరుణుడు

భామిని: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతల అవస్థలు వర్ణనాతీంగా మారాయి. గడిచిన వారం నుంచి వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సాగునీటి వనరులు లేక బోర్లపై ఆధారపడి సేద్యం చేపడుతున్నారు. ముఖ్యంగా భామిని నుంచి పెద్దదిమిలి వరకు నీటి వసతి లేకపోవడంతో నేటికీ ఉడుపులు జరగలేదు. సింగిడి నుంచి బత్తిలి వరకు గల రైతులు బోర్లపై ఆధారపడి సాగు చేపడుతున్నారు. ఓ వైపు వర్షం పడక పంటలు ఎండిపోతుంటే.. మరోవైపు ఉడుపులు జరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

విచ్చలవిడిగా పశువుల సంచారం



ఎల్విన్‌పేట జంక్షన్‌లో సంచరిస్తున్న పశువులు

గుమ్మలక్ష్మీపురం: మండల పరిధిలోని ఎల్విన్‌పేట మూడు రోడ్ల జంక్షన్‌లో విచ్చలవిడిగా పశువుల సంచారం నెలకొంది. ప్రతిరోజూ సాయంత్రం గుంపులు గుంపులుగా పశువులు ఇక్కడకు చేరుకుని, తిష్ట వేస్తున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించలేకపోతున్నామని, పశువులు వాహనాలకు అడ్డం వచ్చినప్పుడు అప్రమత్తంగా లేకుంటే ప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, పశువులు ఇష్టారాజ్యంగా తిరుగుతుండడం వల్ల ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతోందని వాపోతున్నారు. పశువుల యజమానులు వాటిని నిర్లక్ష్యంగా వదిలేయడంతోనే ఈ దుస్థితి నెలకొందని, పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతుల గోడు పట్టదా?

- రైతుసేవా కేంద్రాల్లో నిల్, బ్లాక్ మార్కెట్‌లో ఎరువుల ధర ఫుల్
- అధికారులు, పాలకుల తీరుపై ప్రజాసంఘాల మండిపాటు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఎరువుల కొరత లేదని, నిల్వలు ఉన్నాయని అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎరువులు దొరకక రైతులు అల్లాడుతున్నాడని ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు వంగల దాలినాయుడు ఆదివారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ రైతులు ఎరువుకోసం నానా ఇక్కట్లు పడుతుంటే పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. రైతు సమస్యలు తమకు సంబంధం లేదనే విధంగా వారి తీరు ఉందని మండిపడ్డారు. అదును చూసి డిమాండ్ క్రియేట్ చేసి బ్లాక్ మార్కెట్‌లో ఎరువుల విక్రయాలు చేస్తూ కొందరు వ్యాపారులు సొమ్ముచేసుకుంటున్నారని ఆరోపించారు. అరకొరగా ప్రభుత్వం సరఫరా చేసిన ఎరువులు పలుకుబడి ఉన్నవారికి మాత్రమే దక్కుతున్నాయని రూ.267 ధర పలికే యూరియా ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లో రూ.400 వరకు పలుకుతోందన్నారు. అలాగే డీఏపీని కూడా రూ.1500 వరకు బ్లాక్ మార్కెట్‌లో అవసరాన్ని బట్టి రైతులు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ ఏడాది ఎరువుల పంపిణీలో జిల్లా యంత్రాంగం రైతులను కష్టాల్లోకి నెట్టిందని వాపోయారు.



యూరియా జల్లేందుకు సిద్ధంగా ఉన్న పొలాన్ని చూపిస్తున్న సీపీఎం నాయకుడు

గిరిజన రైతులకు ఎరువులు సరఫరా చేయండి

పార్వతీపురం మండల పరిధిలో ఉన్న గిరిజనులు ఎరువులు అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారని తక్షణమే నిల్వలు సమకూర్చి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా పార్టీలకు అతీతంగా ఎరువులను పంపిణీ చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకుడు పి.రాము కోరారు. జోకిశీల పంచాయతీ తాన్నవలస, తొక్కుడువలస, గ్రామాలతోపాటు మండల పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల రైతులకు వారి అవసరం మేరకు ఎరువులు ప్రభుత్వం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

సాగులో సస్యరక్షణే కీలకం..

- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



పొలంలో నాట్లు వేస్తున్న మహిళా రైతు, వేతనదారులు

పాలకొండ రూరల్: వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ పాటించాలని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే దిగుబడులపై ప్రభావం ఉంటుందని, ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికే పెట్టుబడి సాయం ఆలస్యం కావడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రైతులు అప్పులు చేసి మరీ వరి సాగుకు పెట్టుబడి పెట్టారు. తోటపల్లి కాలువల ద్వారా టైలెండ్ భూములకు సాగునీరు అందడం లేదు. ఈ తరుణంలో అధిక దిగుబడులు సాధిస్తే తప్ప నష్ట నివారణ సాధ్యం కాదు. ఈ క్రమంలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించడంతో పాటు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిందే. ప్రస్తుత సీజన్‌లో వరుణుడి కరుణపై ఆధారపడుతున్న అన్నదాతలు సాగు మెలకువలు, తెగుళ్లు – వాటి నివారణా చర్యలపై అవగాహన కలిగి ఉండడం మేలని ఏడ ప్రసాద్ తెలిపారు. ఈ నేపథ్యంలో సాగుకు సంబంధించి పలు సూచనలు చేశారు.

కాండం తొలుచు పురుగు..

నారుమడి నుంచి పూతదశ వరకు పైరుకు కాండం తొలుచు పురుగు ఆశిస్తుంది. దీంతో దిగుబడులు బాగా తగ్గిపోతాయి. పిలక దశలో మొవ్వు చనిపోవడం, పూత దశలో తెల్లకంకులు ఏర్పడడం జరుగుతుంది. దీని నివారణకు కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములను లీటర్ నీటిలో కలిపి తగినంత మోతాదులో పిచాకారీ చేసుకోవాలి. కార్బోఫ్యూరాన్ 3 గ్రాముల గుళికలు ఎకరాకు పది కిలోలు వాడాలి.

ఆకుముడత పురుగు..

గొంగళి పురుగు ఆకు ముడతలో ఉండి పత్రహరితాన్ని తినేయడం వల్ల ఆకులు తెల్లబడతాయి. దీని నివారణకు లీటర్ నీటిలో 2.5 ఎం.ఎల్ క్లోరిపైరిఫాస్ కలిపి తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

సుడిదోమ..

సుడిదోమ వ్యాపిస్తే పంట ఎండిపోతుంది. దీని నివారణకు ట్రై సైక్లోజోల్ 0.6 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే గట్లపై కలుపు నివారించుకోవాలి.

ఆకు ఎండుతెగులు నివారణ..

బ్యాక్టీరియా వల్ల ఆకు ఎండు తెగులు ఆశిస్తుంది. నత్రజని ఎరువులు తక్కువ పరిమాణంలో ఎక్కుసార్లు వేసుకోవాలి. పొలం ఆరబెడుతూ నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది.

పొట్టకుళ్లు తెగులు..

ఈ తెగులు ఆశిస్తే వెన్నులు పొట్ట దశలోనే కుళ్లిపోతాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతుంది. దీనిని నివారించేందుకు కార్బెండజిమ్ 1.5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పొట్టదశలో ఒకసారి, వారం రోజుల తర్వాత రెండోసారి పిచికారీ చేసుకోవాలి.

నీటియాజమాన్యం...

పిలకలు వేసే దశలో, పైరు దుబ్బు వేయడం పూర్తయ్యేవరకు పొలంలో 2 సెంటీమీటర్ల నీరు ఉండాలి. చిరు పొట్టదశలో, పూత దశలో పొలంలో 5 సెంటీమీటర్ల నీరు ఉండేలా చూసుకోవాలి. పంట పూర్తిగా వెన్ను వచ్చిన తర్వాత క్రమంగా నీరు తగ్గిస్తూ ఉండాలి.

నియోజకవర్గంలో సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతులు
పాలకొండ	6,345	12,901
వీరఘట్టం	7,112	14,201
సీతంపేట	3,079	9,173
భామిని	3,778	7,549

ఎరువుల యాజమాన్యం..

భూసార పరీక్షను బట్టి రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడి పైరుకు సమతుల్యంగా పోషక ఎరువులు అందజేయాలి. ఎకరాకు నత్రజని 96 కిలోలు, భాస్వరం 32 కిలోలు, పొటాష్ 32 కిలోలు అందేటట్టు ఎరువులు వేసుకోవాలి.


జింక్ లోపం–నివారణ..

జింక్ లోపం ఉన్న వరి పంటలో 3 లేదా 4 ఆకుల్లో ఈనె పాలిపోతుంది. నాటిన 2 నుంచి ఆరు వారాల్లో ముదురాకు మధ్యలో ఈనెకు ఇరువైపులా తుప్పు రంగు మచ్చలు ఏర్పడి, ఆకు పెలుసుగా మారుతుంది. పైరు మీద జింక్ సల్ఫేట్ ద్రావణం తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.



నాట్లు వేసేందుకు నొల్లతో మడిని చదును చేస్తున్న రైతు

అవగాహన అవసరం..



వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. సాగునీటి, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి. మండల పరిధిలో ఉడుపులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఇంకా ఉడుపులు చేయదలచిన రైతులు ఆ సమయంలో కాలిబాటలు వేసుకోవడం మేలు. చిన్నపాటి మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

– ప్రసాదరావు, మండల వ్యవసాయాధికారి, పాలకొండ